క్లుప్తంగా

మైక్‌సెట్ వితరణ



అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థి డీవైఎఫ్ఐ నాయకుడు ఆలీ అక్బర్ మైక్‌సెట్‌ను శుక్రవారం పాఠశాలకు వితరణ చేశారు. ప్రార్థన సమయంలో, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మైక్‌సెట్‌ను అందించినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఈ-శ్రమ్‌తో కార్మికులకు ఆర్థిక భరోసా

కేటీదొడ్డి: అసంఘటిత రంగాల్లో ఈఎస్ఐ, పీఎఫ్ లేని కార్మికులకు ఈ-శ్రమ్ ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు అండగా నిలుస్తుందని జిల్లా సీఎస్సీ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 2 లక్షలు అంగవైకల్యం పొందిన వారికి రూ. లక్ష అందజేస్తుందని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోని మీసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీఎస్సీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుబుక్, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేయాలని, 18 నుంచి 59 ఏళ్లలోపు కార్మికులు అర్హులని వివరించారు. వడ్రంగి. ఇటుకబట్టీలు, క్వారీలు, పాలుపోసేవారు, అంగన్‌వాడీ టీచర్లు, బీడీ కార్మికులు, కూరగాయలు, పండ్లు విక్రయించేవారు, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కూలీలు, సన్న చిన్నకారు రైతులు, ఆటో డ్రైవర్లు అర్హులని పేర్కొన్నారు.

శివస్వాములకు ముస్లిం యువకుడి భిక్ష



మానవపాడు: మండల కేంద్రంలోని శివ మాలధారులకు మండల కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సిరాజ్ శుక్రవారం భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి ఆశీస్సులు పొందారు. శివస్వాములకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని సిరాజ్ పేర్కొన్నారు.

శ్రీశైల పాదయాత్రికులకు అన్నదానం



గట్టు: కర్ణాటకకు చెందిన శ్రీశైల పాదయాత్రికులకు శుక్రవారం మండల కేంద్రానికి చెందిన అలుబెంచి రాజప్ప, శివప్ప కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కర్ణాటకలోని షాపూర్, జమ్‌కండి ప్రాంతాలకు చెందిన సుమారు 130 మంది పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలం వెళ్తున్న భక్తులు మండల కేంద్రానికి చేరుకున్నారు. పాదయాత్రికులకు ఈ సందర్భంగా వారు స్వగృహంలో అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి, జిల్లాసహాయ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, చట్టబద్ధ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు భారతీయుడు, వనజ, రాణి, రేవతి ఉన్నారు.

‘బృహత్’ కష్టాలు

- ప్రకృతి వనాల ఏర్పాటుకు తప్పని తిప్పలు
- ప్రభుత్వ భూములు కరువు
- పట్టించుకోని అధికారులు



పుల్లూరులో బృహత్ వనంలో పనులు చేస్తున్న కూలీలు

ఉండవెల్లి: ప్రభుత్వం పల్లెల్లో పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు ఎకర స్థలంలోపు మొక్కలు నాటి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు వేశారు. బృహత్ పల్లె ప్రకృతి వనాల కోసం 10 ఎకరాలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టిపడేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పల్లె ప్రకృతి వనాలకు స్థలాలు ఉండటంతో పనులు సజావుగా కొనసాగాయి. దీంతో పల్లె ప్రకృతి వనాలకు అందుబాటులోకి వచ్చారు. అంతాబాగానే ఉన్నా బృహత్ పల్లె ప్రకృతి వనాలకు స్థలాలు కరువయ్యాయి. అలంపూర్ నియోజక వర్గంలో 7 మండలాల్లో 10 ఎకరాల స్థలంలో ఎక్కడ లేకపోవడంతో బృహత్ పల్లె ప్రకృతి వనాలను మూడు, నాలుగు ఎకరాలలోనే ఏర్పాటు చేశారు.

అయోమయంలో సర్పంచులు

గ్రామాల్లో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్డులు, ప్రకృతి వనాలకు గ్రామ పంచాయతీలలో స్థలాలు లేక ఇబ్బంది ఎదురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ చేయాలో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. మూనుగుతున్న నక్కపై తాటికాయ పడ్డట్టు రెండు, మూడు ఎకరాలకే ఇబ్బందులు పడుతుంటే 10 ఎకరాల స్థలం ఎక్కడ చూడాలని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మండలాలో ఎక్కడో చోటు తక్కువ స్థలం ఉన్న హడావుడిగా బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

7 మండలాల్లో 6 బృహత్ వనాలు

అలంపూర్ నియోజక వర్గంలో 7 మండలాల్లో 124 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఒక గ్రామంలో కూడ 10 ఎకరాల ఖాళీ స్థలం లేదు. ఉండవెల్లి మండలంలో వక్ఫ్‌బోర్డు భూమిలో 6 ఎకరాలకు పైగా ఖాళీ స్థలాన్ని గుర్తించారు. బృహత్ పల్లె ప్రకృతి వనానికి 10 ఎకరాల స్థలాన్ని ఇస్తామని వక్ఫ్ బోర్డు అధికారులు ముందుకువచ్చారు. దీంతో బృహత్ పల్లె ప్రకృతి వనానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. 10 ఎకరాలలో భూమిని చదును చేశారు. వివిధ పనులను ముమ్మరం చేశారు. కొన్ని రోజుల తర్వాత బృహత్ పల్లె ప్రకృతి వనానికి అప్పగించిన స్థలాన్ని తిరిగి అప్పగించాలని వక్ఫ్ బోర్డు అధికారులు కోరారు. ప్రభుత్వ అధికారుల నుంచి ఎటువంటి చలనం లేకపోవడంతో నాటిన మొక్కలను తొలగించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. మానవపాడు మండల కేంద్రంలోని 4 ఎకరాల విస్తీర్ణంలో మొక్కలను నాటారు. అలంపూర్ మండలంలో గొందిమల్ల గ్రామంలో 6 ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనంను ఏర్పాటు చేశారు. ఇటిక్యాల మండలంలో బీచుపల్లిలోని 10 వ బెటాలియన్‌లో 3 ఎకరాలు, మునుగాలలో 4 ఎకరాలలో బృహత్ వనాన్ని ఏర్పాటు చేశారు. రాజోలి మండలంలో పెద్దధన్వాడలో 4 ఎకరాలు, వడ్డేపల్లి మండలంలోని రామాపురం 4 ఎకరాలు, అయిజ మండలంలో సంకాపురం గ్రామంలో 8 ఎకరాలలో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు.

వనానికి ఖర్చులు

బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని 10 ఎకరాలలో ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ తెలిపారు. ఒక్క వనానికి రూ.10 నుంచి 12 లక్షల దాకా ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఒక్కో వనంలో 4 వేల మొక్కలను టార్గెట్‌గా చేయగా అందులో 2 వేల మొక్కలను నాటించారు. వనంలో మొక్కలను నాటించి నాలుగు వైపుల ద్వారాలను ఏర్పాటు చేసి ఫినిషింగ్ చేయించి, చిన్నారులకు పార్కులో అనేక రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేసేలా నిర్ణయించారు.

ప్రభుత్వ భూములు లేవు



మండలంలో ప్రభుత్వ భూములు లేక ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల స్థలాలకు అధిక డిమాండ్‌లు ఉండడంతో విక్రయించేందుకు కూడా ముందుకు రావడం లేదు. మండలంలో ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేవు. బృహత్ పల్లె ప్రకృతి వనానికి 10 ఎకరాలు స్థలం అవసరం లేదు. పల్లె ప్రకృతి వనాలే నిరుపయోగం మారాయి. వన సేవకులకు నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారు. – శేషన్ గౌడ్, సర్పంచు, కంచుపాడు

అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం

ప్రతి మండలంలో వనాలకు స్థలాలను రెవెన్యూ పరంగా పరిశీలిస్తున్నాం. అన్ని మండలాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని మండలాల్లో వనాలకు స్థలాలను కేటాయించి మొక్కలను నాటించాం. ఉండవెల్లి మండలంలోనే స్థలం లేదు. మిగతా చోట్ల రెండు, మూడు ఎకరాలలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశాం. – శ్యాంసుందర్, డీపీఓ

9 నుంచి వీర బ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అయిజ: పట్టణ సమీపంలోని వీర బ్రహ్మేంద్ర శివ రామాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ వారు స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కిశోర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేది సుప్రభాతసేవ, స్వస్తిపారాయణం, మూలవిరాట్‌లకు అభిషేకం, మహాగణపతిపూజ, ధ్వజారోహణం, అంకురార్పణ, బలిహరణ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంకాలం మంగళ వాయిద్యాలతో వీరబ్రంహ్మేంద్రస్వామి ఆలయం నుంచి కాళికాదేవి ఆలయం వరకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరిగిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సర్వేశ్వరాచారి, రవి, వీరేష్, నరసింహ, కాళిదాస్, లక్ష్మయ్య, వీరన్న, రాఘవేంద్ర, నాని, హరి, నరేష్, రంగస్వామి, వినోద్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను, వర్కర్స్‌ను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని చలో పాఠశాల విద్యా కమిషనరేట్ వాల్ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. శుక్రవారం కస్తూర్బా పాఠశాలలో వర్కర్స్‌తో కలిసి ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తిక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా మాట్లాడుతూ కేజీబీవీలో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పీఆర్సీ ప్రకారం బేసిక్‌ను రూ.18 వేలు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో యశోద, ఆరిఫా, ధనలక్ష్మి, జయమ్మ, ఆశీర్వాదమ్మ, ఈశ్వరమ్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: కేజీబీవిల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని, వెంటనే వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ బాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరిగే చలో ఎస్‌పీడీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇటిక్యాలో ఎస్‌పీడీకి సంబంధించిన వాల్ పోస్టర్లను వారు విడుదల చేవారు. కార్యక్రమంలో వెంకటేశ్వరి, జహీరాబీ, గిడ్డమ్మ, సుజాత జ్యోతి, నాగమ్మ, పార్వతమ్మ, రాణి, సరస్వతి, సుభద్ర, జ్యోతి, రవీనా, వపంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డబుల్ ఓటర్ల తొలగింపు



రాజోళిలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ

గట్టు: పక్కాగా డబుల్ ఓటర్ల తొలగింపును చేపట్టాలని తహసీల్దార్ రవికుమార్ బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో 100 పోలింగ్ బూత్ పరిధిలో డబుల్ ఓటర్ల తొలగించే పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బీఎల్‌ఓతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల ఆధార్‌ను అనుసంధానం చేసిన తర్వాత ఒకే వ్యక్తి వివిధ ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుండదని, వివిధ ప్రాంతాల్లో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారిని గుర్తించి ఒక్క చోట మాత్రమే ఓటరు జాబితాలో పేరు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏ ప్రదేశంలో ఓటు ఉండాలో ఓటరు నిర్ణయం తీసుకుంటునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: డబుల్ ఓటరు గుర్తింపు కార్డులు ఉన్న వాటిని గుర్తించి, ఓటరుతో మాట్లాడి ఒక ఓటును తొలగించాలని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ కార్డు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమవంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, ఆర్‌: శ్రీనువాసులు, రాజు తదిదరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



పాల్వాయిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపల్లి, పాల్వాయి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో విత్తనాలు వేసి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాల్వాయి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు నీలిపల్లి, మల్దకల్ గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు పెద్దకిష్టన్న, శివరామిరెడ్డి, ప్రకాష్, యాకోబు, ఏపీఓ స్వామి, టీఏలు, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర్ రూరల్: పరిసరాల పరిశుభ్రతపై క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం డ్రైడేలో భాగంగా ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీరు నిల్వ ఉండకుండ చూడాలని సూచించారు. దోమలు కుట్టడం ద్వారా మలేరియా, చికన్‌గున్యా, మెదడువాపు, బోధకాలు తదితర వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు.

కంటి జాగ్రత్తలు తప్పనిసరి



నందిన్నెలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



క్యాతూర్ పీహెచ్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామస్వామి

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ కంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ అశ్విని అన్నారు. శుక్రవారం మండలలోని నందిన్నెలో నిర్వహించినం కంటి వైద్య కేంద్రంలో మొత్తం 104 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బాలమ్మ, ఎఎన్ఎం సురేఖ, నర్మద, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలోని కంటి వైద్య శిబిరంలో మొత్తం 123 మంది, క్యాతూర్ పీహెచ్‌సీలో మొత్తం 146 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూనరాణి, వైద్యులు హేమమానస రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్య, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంతో పాటు తుమ్మలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం ఎంపీపీ విజయ్‌కుమార్ సందర్శించారు. మొత్తం 263 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఇందులో రీడింగ్ అద్దాలను 23 మందికి పంపిణీ చేయగా, 45 మంది కంటి అద్దాల కోసం ఆర్డర్ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ముగిసిన ఆలయ ఉత్సవాలు



మహవీర్ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామ శివారులోని సరిహద్దులో మహవీర్ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఉత్సవాలను ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి, కలశాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయాన్ని సందర్శించారు. అనంతరం భక్తులకు ఆచార్య భగవాన్ చంద్ర సుర్జి ఆశీర్వచనాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో భక్తులు, స్వామిజీలు తదతరులు పాల్గొన్నారు.

ప్రధాని సందేశం గొప్పది



పరీక్ష పే ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

రాజోళి: విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన సందేశం చాలా గొప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి అన్నారు. శుక్రవారం పరీక్ష పే అనే అంశంపై విద్యార్థులతో నిర్వహించిన చర్చను మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులతో కలిసి ఆయన వీక్షించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు ప్రధాని చెప్పిన వివరణ, సమాధానాలు స్ఫూర్తి నిచ్చేలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధాని సందేశాలతో విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఆయన తెలిపారు. బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ ఆంజనేయులు, బసోది వీరన్న, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు



పెద్దపల్లి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్: గద్వాల- అయిజ ప్రధాన రహదారిలోని పెద్దపల్లి గ్రామ సమీపంలో ఏర్పడిన గుంతలు ప్రమాదభరితంగా మారాయి. అయిజ, గద్వాల రహదారిలో వేలాది వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన ప్రదేశాలలో రోడ్డు కుంగిపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహన దారులు గుంతలను గమనించకుండా ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోయారు. అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణమెప్పుడో?



ఉండవెల్లి నుంచి జాతీయ రహదారి మధ్యలో కంకర రోడ్డు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి మూడేళ్ల కిందట బీటీ రోడ్డు మంజూరు అయ్యింది. ఎమ్మెల్యే అబ్రహం అప్పట్లో పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టి హడావుడిగా కంకర వేసి వదిలేశారు. కాని ఇప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీటీ రోడ్డు కోసం గ్రామస్తుల మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ దారిపై కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంటల పరిశీలన

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్ శివారలో సాగు చేసిన వరి పంటలను శుక్రవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రమౌళి మాట్లాడుతూ యాసంగిలో వరి, మినుములు, వేరుశనగ పంటల తెగుళ్లతో రైతులు జాగత్తగా ఉండాలని, అలాగే వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువ ఉందని, నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్, జింకు లోప నివారణ ఎకరాకు 250 గ్రాముల చిలమీన్ జింకు స్ప్రే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి నరేష్, రైతులు కురుమన్న, శేఖర్, దశరథగౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

